
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 సిద్దిపేట

ఆదివారం 31 ఆగస్టు 2025



కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించాలి

కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో హైకోర్టు జడ్జిలు



కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జిలు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : కక్షిదారులకు సత్వర వేగవంతమైన న్యాయాన్ని అందించాలని హైకోర్టు జడ్జిలు సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు కం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ భవనాన్ని హైకోర్టు జడ్జీలు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పోలీస్ కన్వెన్షన్‌హాల్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ పుల్ల కార్తీక్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్, కోర్టు బెంచ్ ఆరోగ్యవంతమైన సంబంధాలతో ముందుకు సాగాలన్నారు. జస్టిస్ విజయ్‌సేనరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అద్భుతమైన ప్రగతిని సాధించిందని, రోడ్లు, రిజర్వాయర్లు బాగున్నాయన్నారు. జస్టిస్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా ప్రజాపరిపాలన అధికంగా మహిళల చేతుల్లో ఉండడం గౌరవంగా ఉందని, మహిళా న్యాయవాదులు కూడా రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కోర్టు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, సీపీ అనురాధ ముఖ్యఅతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా అతిథుల ద్వారా యూనియన్ బ్యాంక్ వారు బాలసదనంకు రూ.50,000 చెక్కును అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, న్యాయవాదులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఈవోగా అంజనీదేవి

● నేడు ఉద్యోగవిరమణ చేయనున్న ప్రస్తుత ఈవో అన్నపూర్ణ



కొమురవెల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ కార్య నిర్వహణధికారి అన్నపూర్ణ నేడు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ నూతన కార్యనిర్వహణధికారి(ఈవో)గా అంజనీదేవిని నియమిస్తూ దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అంజనీదేవి ప్రస్తుతం దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

గణపతి పూజల్లో జయాగుణచైతన్య రెడ్డి



రామ్‌మందిరం వద్ద గణేష్ మండపంలో ప్రసాదాలను పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి

ప్రసాద వితరణ చేసిన స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జయాగుణచైతన్య రెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్‌మందిరం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జయాగుణచైతన్య రెడ్డి, అల్లుడు గుణచైతన్యరెడ్డి, కుమారుడు భరత్‌సాయి రెడ్డి పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మలా జగ్గారెడ్డి, జయారెడ్డి భక్తులకు లడ్డూ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి కుటుంబ సభ్యులను పూజారి శాలువాలతో సత్కరించారు.



సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రామ్‌మందిరం వద్ద ఏర్పాటు చేసిన గణపతి వద్ద జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

అయ్యో.. యూరియా

ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీగా తగ్గిన కోటా

- అధికారుల కాళ్లు పట్టుకుంటున్న రైతులు
- ఆగస్టు నెలలో 10 వేల టన్నులు కోత
- సెప్టెంబరు కోటా సైతం ప్రశ్నార్థకమే
- 20 జిల్లాల్లో దాదాపు పూర్తయిన పంపిణీ
- తక్కువ కోటాతో మెతుకుసీమకే ఈ దుస్థితి
- తాజా వర్షాలతో అత్యవసరం



'బాంచెన్ సార్.. నీ కాల్మొక్తా ఒక్క బస్తా యూరియా ఇయ్యండి' అంటూ రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజా వర్షాలకు పొలం పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కి కనిపిస్తున్నారు. యూరియా బస్తాల కోసం బారులు తీరుతున్నారు. బస్తా చేతికి రాక నిరాశతో తిరిగివెళ్తున్నారు. వానలోనూ పడరాని పాట్లు పడుతున్నారు. మెతుకుసీమ నలుమూలలా గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కష్టాలు చుట్టుముట్టాయి. ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీగా కోటా తగ్గించడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

సిద్దిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాకు ఆగస్టులో దాదాపు 25 వేల టన్నుల యూరియా అవసరం. కానీ 15వేల టన్నులు మాత్రమే వచ్చింది. మిగతా 10 వేల టన్నులు కోత పెట్టారు. ఈ కోటా కూడా దిగుమతి అయితే యూరియా కష్టాలు ఉండేవి కావు. ఇంత భారీ స్థాయిలో కోటా తగ్గించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీజన్‌లో మెదక్ జిల్లాకు 29వేల టన్నులకు 13,839 టన్నులు, సంగారెడ్డి జిల్లాకు 35వేల టన్నులకు 14,731 టన్నులు, సిద్దిపేట జిల్లాలో 40వేల టన్నులకు 22,503 టన్నులు సరఫరా చేశారు. రావాల్సిన కోటాలో ఇంచుమించు సగమే కేటాయించడంతోనే ఇబ్బందులు వచ్చాయి.

ఆ జిల్లాల్లో ఇబ్బందుల్లేవు..

రాష్ట్రం మొత్తంగా చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లాకే అత్యధికంగా యూరియా కోటా రావాల్సి

మిగతా 7వ పేజీలో

ఆగస్టు నెలలో యూరియా వివరాలు (టన్నుల్లో)

జిల్లా	అవసరం	వచ్చింది	రావాల్సింది
సిద్దిపేట	11,750	5,345	6,405
సంగారెడ్డి	6,616	4,675	1,541
మెదక్	6,600	4,100	2,500
మొత్తం	24,966	14,120	10,466


పొద్దంతా నిరీక్షించినా రాలే

7

ఇదేం జాబితా..!



కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రదర్శించిన ఓటరు జాబితాలో చాలా మంది ఫోటోలు లేవు. పేర్లు మాత్రమే వచ్చాయి. ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులకు కొమురవెల్లిలో చోటు కల్పించారు. ఒక వార్డులో ఉండాల్సిన ఓటు మరో వార్డులో దర్శనమిచ్చింది. ఇక చనిపోయిన వారు పేర్లు తొలగించనే లేదు.




బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రచురించిన ఓటరు జాబితాలో ఏడాది క్రితం చనిపోయిన భార్యాభర్తలు జగ్గవ్వ, రాజిరెడ్డి పేర్లు, ఫోటోలు ఉన్నాయి. వ్యక్తులు, ఇంటిపేర్లూ తప్పుగా వచ్చాయి. పెళ్లయి మరో ఊరికి వెళ్లిన యువతులకు కూడా చోటు దక్కింది. ఇతర ప్రాంతాల్లో శాశ్వతంగా స్థిరపడ్డవారినీ జాబితాలో చేర్చారు

కోహెడ మండలం రామచంద్రాపూర్‌కు చెందిన 19ఏళ్ల జక్కినపల్లి సాయి కౌశిక్ పేరు, వివరాలు ఒకే జాబితాలో ఆరుసార్లు నమోదు చేశారు. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చనిపోయిన వారి పేర్లు కూడా తొలగించలేదు.



తప్పులతడకగా కొత్త ఓటరు లిస్ట్



సిద్దిపేట అర్బన్ మండలం బట్టి రామన్నపల్లికి చెందిన బైరి చామంతి ఓటు పొన్నాల గాంధీనగర్‌లోని జాబితాలో కనిపించింది. ఆమె భర్త సతీశ్ ఓటు మాత్రం బట్టి రామన్నపల్లిలోనే ఉంది. ఒకే చోట నివసిస్తూ భార్యాభర్తల ఓట్లను వేర్వేరు చేయడమే గాకుండా వారి ఇంటి నంబర్లు కూడా మార్చడం గమనార్హం.

- చనిపోయినవారిని తొలగించని వైనం
- ఊరు దాటిన భార్యాభర్తల ఓట్లు
- జాబితాలో ఆరుసార్లు ఫోటో, వివరాలు
- పెళ్లయి వెళ్లిపోయిన వారికీ చోటు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

సిద్దిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించిన కొత్త ఓటరు జాబితాలను చూసి స్థానికంగా ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ జాబితాల ప్రకారమే వచ్చే ఎన్నికలను నిర్వహిస్తున్న నేపథ్యంలో నివ్వెరబోతున్నారు. జాబితాలో కనిపించిన తప్పులు

మిగతా 8వ పేజీలో

'ఎక్సైజ్'కు మామూళ్ల మత్తు..!

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు... నిబంధనలు గాలికి
- కాలం చెల్లిన బీర్‌ల అమ్మకాలు.. ఇష్టారీతిగా పర్మిట్‌రూంలు
- చర్యలు నామమాత్రం

8

కుంటలో పడి వ్యక్తి మృతి 6


చేర్యాల మండలం వేచరేణి చెరువులో మృతదేహం లభ్యం

సెర్ప్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ 8

ట్రయల్ బ్లేజర్స్ మ్యాగజైన్‌లో మన పాఠశాలల కథనాలు

- రాష్ట్ర స్థాయిలో గుర్తింపు..ఎనిమిది పాఠశాలలకు చోటు
- విజయగాథలను ప్రచురించిన ఎస్‌సీఈఆర్‌టీ





మ్యాగజైన్ ఫ్రంట్ పేజ్, అందులోని రామంచ పాఠశాల సక్సెస్ స్టోరీ

సిద్దిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట జిల్లా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, వారి అంకితభావం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయి. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన 2024-25 సంవత్సరపు 'ట్రయల్ బ్లేజర్స్' మ్యాగజైన్‌లో సిద్దిపేట జిల్లాలోని ఎనిమిది పాఠశాలల విజయగాథలు ప్రచురితమయ్యాయి. రాష్ట్రంలోని 51 పాఠశాలల కథనాలతో రూపొందించిన ఈ మ్యాగజైన్‌లో సిద్దిపేట జిల్లా విద్యాశాఖ పెడగాజీపై నిర్వహించిన వర్క్‌షాప్‌తో పాటు ఎనిమిది పాఠశాలల వివరాలను పొందుపరిచారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్ చీఫ్ ఎడిటర్‌గా వ్యవహరించగా, సురేశ్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెంకటరమణమ్మ సహకారంతో ఈ మ్యాగజైన్ వెలువడింది.

మ్యాగజైన్‌లో పాఠశాలలు, ఉపాధ్యాయుల కథనాలు

చిన్నకోడూరు రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వైవి. సురేశ్‌కుమార్ దాతల సహకారంతో స్కూల్ అభివృద్ధికి చేసిన కృషి, ములుగు మండలంలోని సింగన్నగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు క్రాంతి కుమారి పేద

మిగతా 8వ పేజీలో

వైద్యాధికారుల నిర్లక్ష్యం.. డెంగ్యూ విజృంభణ

జగదేవ్‌పూర్ మండలంలో ఆగని మరణాలు

- రెండు గ్రామాల్లో ముగ్గురు బలి
- వైద్యారోగ్య శాఖ మొద్దు నిద్ర



గజ్వేల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలను విషజ్వరాలు కబళిస్తున్నాయి. ఇప్పటికే తిమ్మాపూర్‌లో డెంగ్యూ కారణంగా ఇద్దరు మృతి చెందగా, వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా తాజాగా అనంతసాగర్‌లో మూడో మరణం సంభవించింది. వైద్యాధికారుల నిర్లక్ష్యం పదేళ్ల బాలుడిని బలిగొన్నది. తిమ్మాపూర్‌లో మొదటి డెంగ్యూ మరణం సంభవించినప్పుడే అధికారులు స్పందించి ఉంటే తదుపరి విషాదాలు జరిగి ఉండేవి కావు. రెండు మరణాల తర్వాత జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాలతో హడావుడి చేసినా, మూడో మరణానికి వైద్యాధికారులే బాధ్యతని ప్రజలు నిలదీస్తున్నారు.

320 మందికి జ్వరాలు

తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో 320 మందికి జ్వరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆర్‌ఎంపీల వద్ద వైద్యం తీసుకున్నందుకే మరణాలు సంభవించాయని ఆరోపిస్తూ వారి క్లినిక్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలకు చెందిన ఇళ్లు కలిసే ఉంటాయి. అయితే, ఆర్‌ఎంపీలు, ప్రైవేటు క్లినిక్‌లు, ఇతరత్ర చోట్ల చికిత్స పొందుతున్న ఈ గ్రామాల వారిని గుర్తించి, వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంలో వైద్యాధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చూపారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయంపై గ్రామంలో ఇటీవల పర్యటించిన సమయంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ప్రశ్నించినా పట్టించుకోకపోవడం, వైద్యాధికారుల మొద్దునిద్రను బహిర్గతం చేస్తుంది.

డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ల పాత్రపైనా అనుమానాలు

మరోవైపు ఆర్‌ఎంపీలు రోగులకు స్టెరాయిడ్స్ వంటి ప్రమాదకరమైన మందులు ఇచ్చినట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ల తనిఖీల్లో బయటపడింది. మెడికల్ దుకాణాల యజమానుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుని, అక్రమంగా మందుల అమ్మకాలను ప్రోత్సహిస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటన జరిగినప్పుడు మాత్రమే తనిఖీలు చేసి, ఆ తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం, నిర్లక్ష్యమే ఈ మరణాలకు కారణమని ప్రజలు వాపోతున్నారు.

కార్యదర్శి సస్పెన్షన్... వైద్యాధికారులపై చర్యలేవీ?

పారిశుధ్య చర్యలు సరిగా చేపట్టలేదనే కారణంతో తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శైలేష్‌ను సస్పెండ్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధులు లేక, అప్పులు చేసి పనులు చేస్తున్న తమపై చర్యలు తీసుకోవడం సరికాదని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆగ్రహాన్ని తగ్గించడానికి పంచాయతీ కార్యదర్శిని బలిపశువును చేశారని ఆరోపిస్తున్నారు. డెంగ్యూ మరణాలకు ప్రధాన కారణమైన వైద్యాధికారులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. గ్రామంలోనే క్యాంపు ఏర్పాటు చేసి నిరంతరం ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

వినాయక మండపాలకు జియోట్యాగింగ్

● నిమజ్జనానికి పోలీసుల ముందస్తు చర్యలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 2,750 పైగా గణపతి మండపాలకు అనుమతి తీసుకున్నారు. నవరాత్రులు, నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో పూర్తయ్యేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండపాలకు జియోట్యాగింగ్ చేశారు. జియోట్యాగింగ్‌తో విగ్రహం నిమజ్జనానికి ఏదారిలో వెళ్తుంది, ఎక్కడి వరకు చేరుకున్నది పోలీసు కంట్రోల్‌రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారు. నిమజ్జన కార్యక్రమానికి జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టింది. నిమజ్జనం జరిగే రూట్ మ్యాప్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించడానికి ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహిస్తారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా బృందం పర్యవేక్షిస్తుంది. ప్రతి వినాయక మండపం వద్ద పాయింట్ బుక్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. చెరువులు కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నందున నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వినాయక మండపాల ఆర్గనైజర్లు తగిన చర్యలు తీసుకోవాలని సీపీ డా.అనురాధ సూచించారు.

గణనాథ నీ లడ్డూ గోవిందా!

కుకునూరుపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దొంగలు బంగారం, డబ్బుల వంటి విలువైన వస్తువులను దొంగిలిస్తారు. కానీ ఇందుకు భిన్నంగా కుకునూరుపల్లిలోని ఒక వినాయకుడి లడ్డూను దొంగలించిన విచిత్ర ఘటన చోటు చేసుకుంది. లక్ముడారం గ్రామానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం చేతిలో ఉన్న లడ్డూను అదే గ్రామానికి చెందిన వినయ్, మధు అనే ఇద్దరు యువకులు రాత్రి చోరీ చేసి సగం తినేశారు. మరో మండపం వద్ద లడ్డూను దొంగిలించడానికి ప్రయత్నించగా నిర్వాహకులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరు యువకులను ఎంఆర్‌ఓ ముందు బైండోవర్ చేసి, హెచ్చరించి వదిలిపెట్టారు. వినాయకుడి లడ్డూని చోరీ చేయడం ఏంటిని గ్రామస్థులు నవ్వుకుటున్నారు.

పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో కీలకం

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పెరేడ్


పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో వీక్లీ పెరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ చాలా కీలకమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నాడు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బందికి వీక్లీ పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు శారీరకంగా, మానసికంగా ఫిట్నెస్‌తో ఉన్నప్పుడే ఎలాంటి పరిస్థితులలోనైనా విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలమని అన్నారు. ఫిట్నెస్‌ను కాపాడుకోవడానికి ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. యోగా వంటివి సాధన చేయాలని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎలాంటి పరిస్తుతులలోనైనా స్పందించడానికి సిద్దంగా ఉండాలని అన్నారు. రానున్న వినాయక నిమజ్జనం, ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా తగిన బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పరశురాములు (48)

బెజ్జంకి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముత్తన్నపేటకు చెందిన బొర్ర పరశురాములు(48) అనే వ్యక్తి ఈ నెల 20న ఇంట్లో నుంచి కిరాణ సరుకుల కోసం బెజ్జంకికి ద్విచక్ర వాహనం పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా బెజ్జంకిలో పంది అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. దీనితో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన

పరశురాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్వేరోస్ నెట్ వర్క్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు పరశురాములు బెజ్జంకి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెజ్జంకిలో రోడ్ల పై పందులు స్వైర్య విహారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పందుల కారణంగా ఓ వ్యక్తి ప్రాణం కోల్పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. కోటి పరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం, ఆయన పిల్లలకు చదువుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు.

కుంటలో పడి వ్యక్తి..


సాయిబాబు (ఫైల్)

చేర్యాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన సాయిబాబు (30) మృతదేహం అదే గ్రామశివారులోని కుంటలో అనుమానాస్పదస్థితిలో లభ్యమైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈమేరకు స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిబాబు శుక్రవారం సాయంత్రం గ్రామశివారులోని తమస్వంత వ్యవసాయబావి వద్ద పనులు చేస్తుండగా, అతడి తండ్రి అస్వస్థతకు గురైనట్లు బంధువులు ఫోన్ చేయడంతో ఇంటికి బయలుదేరాడు. కానీ రాత్రివరకు సాయిబాబు ఇంటికి తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకసాగారు. గ్రామశివారులోని వాగు ప్రవహిస్తుండటంతో పరిసరాలలో గాలించినా ఆచూకీ కానరాలేదు. శనివారం ఉదయం గ్రామశివారులోని కుంటకట్ట ఆవరణలో చెప్పులు తేలియాడటాన్ని గమనించడంతో అనుమానం తలెత్తాయి. దీంతో కుటుంబసభ్యులు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో రెస్క్యూటీంను రప్పించారు. స్థానిక యువకులతో పాటు రెస్క్యూటీం కుంటలో గాలించడంతో మృతదేహం లభ్యమైంది. విషయం తెలిసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహ వెలికితీతను పర్యవేక్షించారు. ప్రభుత్వం తరుపున సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని మృతుడి కుటుంబానికి హామీ ఇచ్చారు. కాగా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి పోస్టుమార్టం నిర్వహింపచేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా, గ్రామశివారులోని కుంటకట్ట సమీపంలో కోతుల గుంపు తరచూ సంచరిస్తూ దారినపోయే వారిమీదికి దూసుకువస్తుంటాయని, ఇదేక్రమంలో కోతులగుంపును చూసి భయాందోళనకు గురైన సాయిబాబు కుంటలోపడి ఉంటాడని అభిప్రాయం వ్యక్తం చేశారు.

బహిర్భూమికి వెళ్లిన యువకుడు..


మల్లేశం (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తునికిలో జరిగింది. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి మల్లేశం (28) ఇనెల 28 వ తేదిన రాత్రి బహిర్భూమికి అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మృతుని కుటుంబీకుల తమ బంధువుల వద్ద ఇతర చోట్ల వెతికినప్పటికి ఫలితం లేదు. శనివారం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. ఇదే విషయం పై మృతుని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమొదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మూర్ఛతో బాలుడు..


సుమన్ (ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి : మూర్ఛతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తునికిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోన్యాల సుమన్ (17) బుధవారం మూర్ఛ రావడంతో వెంటనే నర్సాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందతూఊ మృతి చెందాడు.

నర్సింగ్ కాలేజీ విద్యార్థిని షూలో పాము

- సంగారెడ్డిలోని నర్సింగ్ హాస్టల్ వద్ద ఘటన
- భయాందోళనలో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు


విద్యారిని షూలో పాము

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా ప్రాంగణంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనం వద్ద ఓ విద్యార్థిని షూలో పాము కనిపించడం కలకలం రేపింది. శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు, విద్యార్థినులు తెలుపగా, శనివారం వెలుగులోకి వచ్చింది. దీంతో నర్సింగ్ విద్యార్థినులు తీవ్ర భయాందోళనలో పడ్డారు. నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పక్కనే పెద్ద తోట ఉండడంతో పాము అక్కడి నుంచే వచ్చి ఉండవచ్చనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో. ఎప్పుడు ఏ క్రిమికీటకం ఎక్కడి నుంచి వచ్చి కాటేస్తుందోనన్న భయాందోళన నెలకొన్నదని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పక్కా భవనాలు త్వరితగతిన పూర్తి చేసి తమను తరలించాలని విద్యార్థినీలు కోరుతున్నారు. కాగా విద్యార్థినీ బూటులో పాము వచ్చిన సంఘటన వాస్తవమేనని, కానీ సిబ్బంది సత్వరం స్పందించి పామును చంపేశారని, ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని సంగారెడ్డిలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుశీల తెలిపారు.

వెరైటీ గణేశా..



రామచంద్రాపురం అశోక్‌నగర్‌లో 40వ ఏట నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వరాహ అవతారంలో వినాయకుడు



సిద్దిపేట పట్టణంలో..



దుబ్బాకలోని కేధారీశ్వరాలయంలో వినాయకుడికి లక్ష గరికపూజ చేస్తున్న మహిళలు



సంగారెడ్డిలోని నేతాజీ నగర్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు

వివిధ రూపాల్లో గణపయ్య

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణేశ్ నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులకు భక్తులు పూజలు చేసేందుకు పోటెత్తుతున్నారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన గణపయ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కూరగాయలు, గరికతో వినాయకులను అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి)



నారాయణఖేడ్‌లో ప్రతిష్ఠించిన మట్టి గణపతి



మెదక్ : కోలిగడ్డలో ఏర్పాటు చేసిన 23 ఫీట్ల గణనాథుడు

పొద్దంతా నిరీక్షణ..

● యూరియా కోసం రైతుల అవస్థలు



బెజ్జంకిలో యూరియా కోసం క్యూలో నిలబడ్డ రైతులు

నర్సాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు నానాటికీ పెరుగుతున్నాయి. శనివారం నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగారు. వచ్చిన ఒకే ఒక్క లారీ యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిజాంపేట : నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షణలో రైతులకు ఒక బస్తా యూరియాను అందజేశారు. ఏవో సోమలింగారెడ్డి, ఎస్సై రాజేష్, వ్యవసాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుమ్మడిదల:(గుమ్మడిదల రైతు సంఘం సొసైటీ వద్ద యూరియా సరఫరా చేస్తున్నారని తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో గందరగోళం నెలకొంది. పోలీసులు పర్యవేక్షణలో ఆధార్ కార్డు చూపించిన రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. కొంతమంది రైతులకు యూరియా లభించగా, మరికొందరు నిరాశతో వెనుదిరిగారు.

వెల్దుర్తి : వెల్దుర్తి సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు 480 బస్తాల యూరియా రావడంతో సుమారు 300 మంది రైతులకు మాత్రమే యూరియా లభించింది. ఏవో ఝాన్సీ మాట్లాడుతూ, 50 మంది రైతుల జిరాక్స్‌లను స్వీకరించామని, వారికి సోమవారం యూరియా అందజేస్తామని తెలిపారు.

కౌడిపల్లి : కౌడిపల్లి రైతు వేదిక వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులకు పోలీసులు, వ్యవసాయ అధికారుల సమక్షంలో టోకెన్లు పంపిణీ చేశారు.

కొల్చారం : కొల్చారం మండలంలోని రంగంపేటలో యూరియా సరఫరాలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఏవో శ్వేత కుమారి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



గుమ్మడిదల లో రైతు సాకార సొసైటీ సంఘంలో యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు



వెల్దుర్తి సొసైటి ఎరువుల విక్రయ కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

చేర్యాల : చేర్యాల మండల రైతులు టోకెన్ల కోసం గంటల తరబడి వేచి చూశారు. ఒక బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద నిరసన చేపట్టారు.

అక్కన్నపేట : యూరియా కోసం రైతులు అక్కన్నపేటలోని ఆగ్రోస్ కేంద్రం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. యూరియా రాకపోవడంతో రైతులు వ్యవసాయ అధికారులను రైతు వేదికలో నిర్బంధించారు.

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలంలో ఆగ్రోస్ కేంద్రానికి యూరియా లోడ్ రాగానే రైతులు క్యూ కట్టారు. పరిమితంగా యూరియా లభించడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

బెజ్జంకి : బెజ్జంకిలో ఒక ఫర్టిలైజర్ షాపు వద్ద యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు గుమిగూడారు. పోలీసుల పహరాలో భూ విస్తీర్ణాన్ని బట్టి ఒకటి లేదా రెండు బస్తాలు పంపిణీ చేశారు.

తొగుట : తొగుట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు ఆందోళన నిర్వహించారు. తొగుట సొసైటీ కార్యాలయం వద్ద చెప్పులు, బీరు సీసాలు పెట్టి నిరసన తెలిపారు. అనంతరం ఆగ్రోస్ దుకాణం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. తొగుట సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

హుస్నాబాద్ : హుస్నాబాద్‌లో యూరియా కోసం రైతులు రైతు మిత్ర, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాల ముందు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రైతు వేదికకు తాళం వేసి ఉండటంతో వ్యవసాయ అధికారి కోసం పడిగాపులు కాశారు.

రామాయంపేట : రామాయంపేట పట్టణంలో 500 బస్తాల యూరియా లారీ రాగా, 1000 మంది రైతులు గుమిగూడారు. సిబ్బంది టోకెన్లు ఇవ్వగా, మిగతావారు నిరాశతో వెనుదిరిగారు.

నంగునూరు : నంగునూరు సహకార సంఘం వద్దకు 560 బస్తాల యూరియా వస్తుందని తెలిసి సుమారు 1200 మంది రైతులు క్యూ కట్టారు.

అయ్యా.. యూరియా

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఆగస్టు నెలకు సంబంధించి దాదాపు 20 జిల్లాల్లో యూరియా పంపిణీ పూర్తయ్యింది. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవు. మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, భూపాలపల్లి జయశంకర్, ఖమ్మం, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట జిల్లాలకు పూర్తి కోటా పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, ములుగు జిల్లాల కోటా దగ్గరపడింది. ఆగస్టు నెలలో సుమారు 40 వేల టన్నుల బ్యాలెన్స్ ఉండగా ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాల్సిన యూరియానే 10,466 టన్నులు ఉండడం గమనార్హం. కొన్ని జిల్లాల్లో కోటాకు మించి తరలించడం కూడా కొరతకు కారణమైనట్లుగా తెలుస్తోంది.

ప్రైవేట్ డీలర్ల విముఖత

యూరియా విక్రయించడానికి ప్రైవేట్ డీలర్లు విముఖత ప్రదర్శిస్తున్నారు. ఆగ్రోస్, సొసైటీలకు తరలిస్తున్న యూరియా రవాణా చార్జీలను మార్క్‌ఫెడ్ భరిస్తున్నది. దీంతో వారు రూ.266కే ఒక బస్తా యూరియా విక్రయిస్తున్నారు. అయితే ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసే యూరియాకు రవాణా చార్జీలను పూర్తిగా డీలర్లే భరించాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో బస్తాకు రూ.290దాకా ఖర్చు అవుతున్నదని, ఎమ్మార్పీకి విక్రయిస్తే ఏ లాభం ఉండదని చెబుతున్నారు. ఈ పరిస్థితిలో రూ.300కు విక్రయిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని అంటున్నారు. వీరి రవాణా ఖర్చులను కూడా మార్క్‌ఫెడ్ భరిస్తే సగం ఈ పరిస్థితి వచ్చేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తొగుటలో యూరియా కోసం రోడ్డుపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి

నేడే డీడీఎస్‌లో ఆకుకూరల పండుగ



పొలాల్లో సహజసిద్ధంగా లభించిన ఆకుకూరలు

జహీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పుల నేపథ్యంలో పోషకాహారం కోసం చిరుధాన్యాలు, ఆకుకూరల వైపు ప్రజలు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో జహీరాబాద్ ప్రాంతంలో 35 ఏళ్ల క్రితం ఏర్పడిన డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఏటా డీడీఎస్ వాటి ప్రాముఖ్యతను తెలియజేసేందుకు కృషి చేస్తున్నది. అందులో భాగంగా డీడీఎస్ మహిళలు ప్రతి ఏటా ఆకుకూరల పండుగను నిర్వహిస్తూ వాటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ సారి కూడా నేడు(ఆదివారం) పండుగ నిర్వహణకు సిద్ధమైంది. ఈ పండుగను పస్తాపూర్, అల్గోల్ గ్రామాల్లో నిర్వహిస్తామని డీడీఎస్ మహిళలు పేర్కొన్నారు. తుమ్మికూర, తట్టెల్లి, అడవి మెంతం, జొన్నచెంచలి, అడవిసోయ, దొగ్గలి, ముల్లుదొగ్గలి వంటి 40 రకాల ఆకుకూరలు పొలాల్లో లభిస్తాయని డీడీఎస్ మహిళా రైతులు తెలిపారు.

దిగువ ప్రాంతాలకు వరద ముప్పు



చౌటకూర్ శివారులో కొన్యాల వంతెన వద్ద మంజీర ఉధృతి

పుల్కల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో సింగూరు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తారు. మంజీర నదిపై ఉన్న ప్రాజెక్టులు నిండిపోవడంతో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సింగూరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 76,321 క్యూసెక్కులుగా నమోదైంది. జల విద్యుత్ ఉత్పత్తి గేటు ద్వారా 1,732 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మంజీర బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునక

సింగూరు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తితే మంజీర రిజర్వాయర్ వద్ద 9 గేట్లు ఎత్తాల్సి ఉంటుంది. కానీ, సాంకేతిక సమస్య కారణంగా గేట్లు పైకి లేకపోవడంతో వరద నీరంతా ఆయా గ్రామాల శివారు భూములను ముంచెత్తుతున్నది. మంజీర నది తీర ప్రాంత గ్రామాలైన పోచారం, పుల్కల్, మినాపూర్, కోడూరు, ఇసోజిపేట, గొంగ్లూరు, గంగోజిపేట, చక్రియాల, శివంపేట, వెండికోలు, లింగంపల్లి, కోర్పోలు, సరాఫ్‌పల్లి, చౌటకూర్ శివారు భూముల్లో వరి, పత్తి, కంది, పెసర, మినుము, చెరుకు పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం మంజీర రిజర్వాయర్ వద్ద 4,5,6,7,8,9 నంబర్ గేట్లను ఐదు మీటర్లు ఎత్తారు. దీంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

పాపన్నపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టు నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున మంజీర నది పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం ఆయన పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారి ఆలయం వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి వస్తున్న భారీ వరద కారణంగా మంజీర ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల నీరు విడుదలైనందున ఏడుపాయల వనదుర్గామాత ఆలయం, ఎల్లాపూర్ వంతెనలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ప్రజలు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సూచనలు పాటించాలని, పశువుల కాపరులు, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, రెవెన్యూ, పాల్గొన్నారు.



వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

అటవీభూమి ఆక్రమణకు యత్నం

● నాలుగు వాహనాలు స్వాధీనం

శివ్వంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అటవీభూమిని ఆక్రమిస్తున్నారని అటవీశాఖ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు డోజర్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అటవీశాఖ సెక్షన్ అధికారి శ్రీధరాచార్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని పిలుట్ల రిజర్వు ఫారెస్ట్‌లో కొందరు గుట్టు చప్పుడు కాకుండా అడవి భూమిలో చెట్లను, పొదలను తొలగించి వ్యవసాయ భూమిగా మార్చేందుకు ఎక్స్‌కవేటర్లు, డోజర్ ట్రాక్టర్లతో భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలిసి అటవీశాఖ అధికారులు దాడులు చేసి రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని నర్సాపూర్ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధిరాంసింగ్, సెక్షన్ ఆఫీసర్లు, రాజమణి, సాయిరాం, బీట్ ఆఫీసర్ కుమార్ వెంకటేష్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌ది మాటల ప్రభుత్వమే..

● మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

మునిపల్లి, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతోనే సరి పెడుతుందని, చేతల్లో మాత్రం చూపించడం లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. శనివారం మునిపల్లి మండలం పీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే ఇప్పుడు ప్రజలకు కనబడుతున్నాయని, అప్పట్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పుడు శంకుస్థాపనలు చేసి తమ ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందంటూ గొప్పలు చెప్పుకోవడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండేళ్లు కావస్తున్నా.. ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో పనులు తప్ప, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం రైతులు యూరియాతో ఇబ్బందులు పడుతున్నా.. యూరియా కొరతను తీర్చలేకపోతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, నాయకులు శివశంకర్, చంద్రయ్య, పరుశరాం గౌడ్, భాస్కర్, రమేష్, శంకర్, విశ్వనాథం, శ్రీనివాస్, వెంకటేశం, పాండు, దత్తు, దుర్గయ్య, కుతుబోద్దీన్, మౌలానా పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజల సేవలో..

● మెదక్ మిల్లీ అసోసియేషన్ సభ్యుల ఉదారత
● ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని..
● కులమతాలకు అతీతంగా సామాజిక సేవలు

మెదక్ కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన గ్రామాలను గుర్తించిన అధికారులు, ఆ గ్రామాలను ఖాళీ చేయించి మెదక్ పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెదక్ మిల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధితులకు ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని రకాల సేవలు అందిస్తూ వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకుంటున్నారు. ముంపునకు గురైన సర్దన గ్రామానికి చెందిన 1200 మంది ప్రజలను మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర గార్డెన్, జీకేఆర్ గార్డెన్‌లకు తరలించారు. మెదక్ మిల్లీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమర్ ఖాన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ సూఫీ సుజాయత్ అలీ ఆధ్వర్యంలో వీరికి ఆహారం, వైద్య సేవలు అందించారు. గాంధీనగర్, రాంనగర్ ప్రాంతాల్లోని 159 మందికి, రాయన్‌పల్లి గ్రామంలోని 130 మందికి ఆహారం, నీటిని అందించారు. రోడ్డు మార్గం లేని ధూప్‌సింగ్ తండా, ఘనపూర్, సర్దన గ్రామాలకు కాలినడకన వెళ్లి బియ్యం, నూనె, నిత్యావసర వస్తువులతో కూడిన తీకొహా కిట్లను పంపిణీ చేశారు.



ఇంటింటికి వెళ్లి సరకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కులమతాలకు అతీతంగా సేవలు


డాక్టర్ సూఫీ సుజాయత్ అలీ మాట్లాడుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కులమతాలకు అతీతంగా సేవలందిస్తున్నామని తెలిపారు. సేవలందించడంలో చాలా సంతోషంగా ఉందని, వర్షాలు తగ్గే వరకు అవసరమున్న గ్రామాలకు సేవలు అందిస్తామని అన్నారు. ఈ సంస్థ తరపున అనేక కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు సేవలందిస్తామని పేర్కొన్నారు. ఈ సేవలో జర్నలిస్టు రియాజ్, ఒమర్ ఖాన్, సయ్యద్ సాదత్ అలీ, జాకీ, జుబేర్ మెహతాబ్ మెడికల్, ఫాజిల్, అతీక్, కిజర్, అంజద్, ఇమ్రాన్, ఉమర్, అబిద్, హసద్, యూసఫ్ జర్నలిస్టు తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో ఆహార పొట్లాలు సరఫరా చేస్తూ..

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్వేశ్వర్‌రావు

గజ్వేల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణానికి చెందిన పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వరరావు గత ఐదు సంవత్సరాలుగా స్నేహం గురించి పాటలు రాయడం, స్వరపరచడం చేస్తున్నారు అయనలోని ప్రతిభను గుర్తించి లండన్‌లోని ఇంటర్ నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించి ధ్రువీకరణ పత్రం అందించారు.



‘ఫిర్యాదు చేసినా పట్టించుకోరా..?’

● కాలం చెల్లిన బీర్లపై సీఆర్‌సీ చైర్మన్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ గుండ్ల శివచంద్రం

సిద్దిపేట క్రైం ఆగస్ట 30 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన బీరు తాగి యువకుడు అస్వస్థతకు గురయిన సంఘటనలో సిటిజెన్ రైట్స్‌కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులకి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని సీఆర్‌సీ చైర్మన్ గుండ్ల శివచంద్రం ఆరోపించారు. శనివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. దుబ్బాక పట్టణ పరిధిలో ఉన్న రేణుక ఎల్లమ్మ వైన్స్‌లో కాలం చెల్లిన బడ్వైజర్ బీరు తాగిన యువకుడు అస్వస్థకు గురయ్యాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారని తెలిపారు. ఈ విషయంపై పూర్తి ఆధారాలతో సిద్దిపేట ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. అయిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

మున్నూరు కాపులు ముందుకు సాగాలి



మాజీ జడ్పీటీసీ కర్ర శ్రీహరికి సభ్యత్వం అందజేస్తున్న శ్రీనివాస్

కోహెడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కోహెడ మండలం శనిగరం గ్రామంలో మాజీ జడ్పీటీసీ, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీహరికి నియోజకవర్గంలో మొదటగా సంఘం సభ్యత్వాన్ని ఆయన అందజేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మున్నూరు కాపులను సంఘటితం చేసి ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాలకతీతంగా మున్నూరు కాపులను చైతన్య పరచాలని అన్నారు.

నష్టపరిహారం అందించాలి

కుకునూరుపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు వెంటనే రైతులకు నష్టపరిహారం అందజేయాలని రైతుబంధు రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ డిమాండ్ చేశారు. శనివారం కుకునూరుపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రూ. 25 వేలు అందించి రైతులను ఆదుకోవాలని, యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు చేసింది ఏమీ లేదని రైతుబంధుకు రామ్‌రామ్ రైతుల బీమాకు బాయ్‌బాయ్ చెప్పారని ఆయన దుయ్యబట్టారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ భవనాలకు రూ. 2కోట్ల 32 లక్షల మంజూరు

దుబ్బాక, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా 29 అంగన్‌వాడీ భవనాలకు రూ.2కోట్ల 32లక్షల రూపాయాల నిధులు మంజూరు చేయించినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం దుబ్బాక విలేకరులకు ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. అక్బర్ పేట భూంపల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు, మిరుదొడ్డి మండలంలోని కొన్ని గ్రామాలకు, శేరిళ్ల తొగుట మండలంలోని గ్రామాలకు రాయపోల్ మండలంలోని కొన్ని గ్రామాలకు ఒక్కొక్క భవనానికి రూ. 8 లక్షల చొప్పున రూ. 2.32 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు

హుస్నాబాద్ టౌన్/సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత ఒక ప్రకటనలో తెలియజేశారు. పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్ 1, కామర్స్ 1, వృక్షశాస్త్రం 1 పోస్టులు ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగి ఉండి డిగ్రీ కళాశాల స్థాయిలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్నవారు సెప్టెంబర్ 2 వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 3న దరఖాస్తు చేసుకున్న వారికి కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం కృషి

చేర్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమంకోసం తాను చిత్తశుద్ధితో పాటుపడుతున్నట్లు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు సంక్షేమపథకాలు ఏమాత్రం దక్కలేదని, రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. ప్రజల కష్టాలు గుర్తెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శక ప్రజాపాలనతో సుభిక్షంగా ఉన్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు సన్నబియ్యం, సొంతింటికల నేరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు అందించారన్నారు. రైతాంగానికి ఏకకాలంలో రూ.2లక్షల పంటరుణమాఫీ చేశారన్నారు. అనంతరం పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. డాక్టరేట్, సేవారత్న అవార్డు గ్రహీత కరాటే పాషాను కొమ్మూరి అభినందించారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు

చిన్నకోడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం మాచాపూర్‌కు చెందిన పున్నం రవి (44) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. రవికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో చిన్న కూతురు శృతి తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు

కొండపాక,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని పంట పొలాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని స్వరూప రాణి తోర్నాల తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం డా. పల్లవి, డా. రమాదేవి, సరిత లతో కలిసి శనివారం పరిశీలించారు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు 30 కిలోల యూరియా 15 కిలోల మ్యురాట్ అఫ్ పోటాష్‌ను బురద పదునులో సమానంగా చల్లుకోవాలని తెలిపారు.

‘ఎక్సైజ్’కు మామూళ్ల ‘మత్తు’..!

● విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
● నిబంధనలు తుంగలోకి...
● ఇష్టారీతిగా పర్మిట్‌రూంలు
● కాలం చెల్లిన బీర్‌తో నామమాత్రం చర్యలు

దుబ్బాక, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో మద్యం దుకాణాల తీరు ఇష్టారీతిలో సాగుతోంది. కాలం చెల్లిన బీర్లను అమ్మి, ప్రజల ప్రాణాల మీదకు తీసుకుని వచ్చిన సంగతి తెలిసిందే. ఈవ్యవహారం బయటకు వచ్చే వరకు కదలని ఎక్సైజ్ అధికారులు , తూతూమంత్రంగా తనిఖీలు చేసి.. చివరికి టెక్నికల్ కేసులు నమోదు చేస్తామంటూ దుబ్బాకలోని నాలుగు మద్యం దుకాణాల మీద కేసు నమోదు చేశారు. ఆయా మద్యం దుకాణాదారులు కనీసం నిబంధనను కూడా పాటించకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తూ, ఎక్సైజ్ విధానాలను తుంగలో తొక్కుతున్నారు. దుబ్బాక రేణుకా ఎల్లమ్మ వైన్స్ తోపాటు మణికంఠ వైన్స్, బాలాజీ వైన్స్, లక్కీ వైన్స్‌ల మీద టెక్నికల్ కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పర్యవేక్షణ కరువు

ఎక్సైజ్ శాఖ అధికారులు సిండికేట్‌గా మారిన మద్యందుకాణాదారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారనే ఆరోపణలున్నాయి. అధికారులు ప్రతి వారంలో రెండు సార్లు ప్రతి వైన్స్ దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. మద్యం వ్యాపారులు బీర్లను అలాగే ఉంచి, అలాగే అమ్మడం వల్ల కాలం చెల్లిన బీర్లను తాగి అస్వస్థతకు గురైనట్లు తెలుస్తుంది.

సీసీ కెమెరాలే లేవు

దుబ్బాకలోని కొన్ని మద్యం దుకాణాలు సీసీ కెమెరాలను తొలగించడం పలు అనుమానాలకు తావిస్తుంది. మద్యం దుకాణాల్లో సీసీకెమెరాలు తప్పని సరిగా ఉండాలనే నిబంధన ఉంది. అంతేగాక ఒక్క ఖాళీబాటిల్ కూడా ఉండవద్దనే నిబంధన కూడా ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూంలు

రేణుకామాత ఎల్లమ్మ వైన్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన పర్మిట్‌రూం అనుమతి కూడా నిబంధనలకు విరుద్ధంగానే ఉందని చెప్పాలి. బయట చిరుతిండ్లు పర్మిట్‌రూంలోకి అనుమతినివ్వకుండా అధికధరలకు తామే వండిఇవ్వడం గమనార్హం. ఏదీఏమైన దుబ్బాకలో వైన్స్ దుకాణాలల్లో సిండికేట్ వ్యవహారం మద్యం ప్రియులను నిండా దోపిడికి గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బెల్ట్‌దుకాణాల్లో అధిక ధరలు

సిద్దిపేటకు దగ్గరగా ఉండే తిమ్మాపూర్, అప్పనపల్లి, హసన్‌మీరాపూర్ దుబ్బాకకు దూరంగా ఉంటుంది. తమకు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు తమ పరిధిలోనే మద్యం దుకాణాలల్లోనే మద్యం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో దాడులు చేపడుతున్న ఎక్సైజ్ అధికారులు, కనీసం ఇష్టారీతిగా ధరలను నిర్ధారించే మద్యం దుకాణాలను మాత్రం నియంత్రించలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి.

ఇదేం జాబితా..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు, సిబ్బంది లోపాలను ఎత్తిచూపుతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో ఓటరు జాబితాలపై పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తం కావడమే ఇందుకు నిదర్శనం.

వాళ్లు బతికే ఉన్నారట..

నాలుగేళ్ల క్రితం చనిపోయినవారికి కూడా తాజా ఓటరు జాబితాలో ఓటు హక్కు కల్పించారంటే అతిశయోక్తి కాదు. గత జనవరి నుంచే అప్‌డేట్ చేశామని పలువురు సిబ్బంది చెబుతున్నారు. ఇలాగైతే ఏడాది క్రితం చనిపోయివారి పేర్లు చాలాచోట్ల కనిపించినట్లు తెలుస్తున్నది. చనిపోయిన వారి వివరాలు జాబితాలో ఉండడం చూసి ఆయా గ్రామస్థులు అధికారుల పని తీరుపై ఆశ్చర్యపోతున్నారు. వీరిని తొలగించాల్సి ఉండగా కొన్నిచోట్ల మాత్రమే సవరించారు.

చిత్రవిచిత్రంగా జాబితా

పకడ్బందీగా ఉండాల్సిన ఓటరు జాబితాలో చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. భార్యభర్తల చిరునామాలను మార్చడం, ఒక ఊరి ఓటరును మరో ఊరిలో చేర్చడం, ఏళ్ల క్రితం పెళ్లయినవారికి మళ్లీ ఓటు హక్కు కల్పించడం, ఒక్కరి ఫొటో, వివరాలు పలు మార్లు కానరావడం విమర్శలకు దారితీస్తోంది. గతంలో ఉన్న జాబితాలోని తప్పుల సవరణ చేయాల్సిన వాళ్లు ఇంకా ఎక్కువ తప్పులు చేశారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిమజ్జనంలో ఇబ్బందులు వద్దు

సిద్దిపేట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో నిమజ్జనానికి ఎలాంటి అసౌకర్యం, అపశృతి జరగకుండా చూడాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 5 వ వార్డులో సిబ్బందితో కలిసి కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతమైన శ్రీనగర్ కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై కౌన్సిలర్ వినోద్‌గౌడ్ కోరిక మేరకు మొరం పోయించాలని సిబ్బందికి సూచించారు. వర్షపు నీటిలో కొట్టుకు వచ్చిన దుస్తులు, సంచులు, చెత్త గృహ పరిసరాలలో ఉండడం గమనించి వెంటనే వాటిని తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు.

పాఠశాల ఆవరణలో నీరు



ఇబ్బందులు తొలగడానికి రాళల్లో వేసిన బాట

కొండపాక, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలికల మూత్రశాల వద్ద వర్షపు నీరు నిలవ ఉండడంతో విద్యార్థినిలు నానా ఇబ్బందులు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలో గల విద్యార్థినిల మూత్రశాల చుట్టూ నీరు ఉండడంతో వెళ్లడానికి ఇబ్బందులకు గురయ్యారు. విషయాన్ని గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువెళ్లగా బండరాళ్లు వేసి కొద్ది దూరం నీరు లేకుండా చేశారు. దీంతో నీళ్ల నుంచే వెళ్లి మూత్రశాలలకు వెళ్లాల్సి వస్తుంది.

సృజనాత్మకత బోధనతోనే గుణాత్మక విద్య



జగదేవ్‌పూర్‌లో టీఎల్‌ఎం మేళాలో పాల్గొన్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలో బోధన సృజనాత్మకంగా, విద్యార్థులకు నేర్చుకోవాలన్న ఆసక్తిని రేకెత్తించేలా ఉండాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండలంలో ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన ప్రాథమిక స్థాయి టీఎల్‌ఎం మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తరగతి గదిలోకి రాగానే చదవడం రాయడం కాకుండా విద్యార్థులకు బోధనాభ్యాసన వైపు ఆసక్తి రేకెత్తించేలా బోధన విధానాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులలో ఉన్న సృజనాత్మకతను మండలంలోని ఇతర ఉపాధ్యాయులతో పంచుకోవడానికి ఇలాంటి మేళాలు ఉపయోగపడతాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు బడిబాట మంచి ఫలితాలను ఇచ్చిందని, అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.

అడ్మిషన్లు పెంపొందించాలి

చేర్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపొందించడంతో పాటు సంపూర్ణ ఉత్తీర్ణతశాతాన్నిసాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సిద్దిపేట జిల్లా డీఐఈవో కె.రవీందర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కళాశాల రికార్డులు పరిశీలించి అడ్మిషన్ల ప్రగతిపై ఆరాతీశారు. తరగతి గదులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని, అన్నారు.

లంబాడా గిరిజనుల ఆందోళన



హుస్నాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి బంజారా, లంబాడీలను తొలగించాలని సుప్రీం కోర్టులో తెల్లం వెంకట్రావు, సోయం బాపురావులు పిటిషన్ వేయడాన్ని నిరసిస్తూ శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజనులు ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు.

ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలి

మిరుదొడ్డి, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని మిరుదొడ్డి,అక్బర్‌పేట-భూంపల్లి ఎంపీడీఓలు గణేష్‌రెడ్డి, జహిరోద్దిన్‌లు అన్నారు. శనివారం మిరుదొడ్డి, అక్బర్‌పేట ఎంపీడీఓ కార్యాలయాల్లో అన్ని పార్టీల నాయకులతో వేరువేరుగా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పార్టీ అభిప్రాయాలను తీసుకోవడం జరిగిందని తెలిపారు. రెండు మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఓటరు జాబితా లిస్టును పంచాయతీల వద్ద నోటీస్‌బోర్డు వద్ద అతికించినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వెంకటస్వామిగౌడ్, అంజిరెడ్డి, మాదూరి రాజు, వెంకటేశం, అమర్, రాజు, కనకారెడ్డి, అంజయ్య, సుదర్శన్, కుమార్ తదితరులున్నారు.

పార్టీల ప్రతినిధులతో సమావేశం

చేర్యాల/కొమురవెలి/హుస్నాబాద్‌రూరల్./మద్దూరు,/బెజ్జంకి,/కొండపాక, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాల జాబితాలపై శనివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఎంపీడీవో కార్యాలయాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపాక ఎంపీడీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు అంటే తెలపాలని సూచించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

జాన్ వెస్లీ అరెస్ట్ అప్రజాస్వామికం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అరెస్టు చేయడం ప్రజాస్వామికమని పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం రామోజీ ఫిలిం సిటీ పక్కన ఉన్న అనాజిపూర్ భూములను అక్రమంగా రామోజీ ఫిలిం సిటీకి కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఉద్యమం చేస్తున్న సీపీఎం నాయకుల అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. పేద ప్రజల భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వెళ్తాడనే కారణంతో జాన్ వెస్లీని ఇంటి వద్దనే హౌస్ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యం కాదని అన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

సిద్దిపేట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సిద్దిపేట పట్టణంలో వరద నీట మునిగిన ప్రాంతాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకేసారి రావడంతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, పండుగల నేపథ్యంలో పట్టణంలో చేపట్టవలసిన భద్రతల పట్ల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని చెరువులు, కుంటల వద్ద విద్యుత్ దీపాలు, సహాయక యంత్రాలు, భద్రత సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు పూర్తిగా నీటితో నిండటంతో ఎవరు కూడా లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలు మున్సిపల్, పోలీస్ అధికారులకు తప్పకుండా సహకరించాలని కోరారు.

ప్రెస్‌క్లబ్ రజతోత్సవాలను జయప్రదం చేద్దాం

గజ్వేల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్ రజతోత్సవాలను జయప్రదం చేద్దామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్‌అలీ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం రజతోత్సవాల సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా, ఆయన హాజరయ్యారు. గత పాతికేళ్లలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆయా కార్యక్రమాల గూర్చి చర్చించారు. రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన సభకు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 7, ఆదివారం రోజున ఉదయం 10గంటల నుంచి రజతోత్సవాలు ప్రారంభమౌతాయని, ఈ సభకు ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ట్రయల్ బ్లేజర్స్ మ్యాగజైన్‌లో మన పాఠశాలల కథనాలు

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులకు విద్యనందించడంలో చూపిన అంకిత భావంపై కథనాలు ప్రచురితమయ్యాయి. అహ్మదీపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆఫీసుద్దీన్, కాసులబాద్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, సిద్దిపేట అర్బన్ పరిధి బక్రీచెప్యాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సంధాని, వర్గల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్‌గౌడ్, తునికికల్సా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మంజుల, షేర్‌పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవి అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాల విజయ గాధలను ప్రచురించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వీటిని తీర్చిదిద్దడం, విద్యార్థుల సంఖ్యను పెంచడం వంటి విషయాలు ఇందులో ఉన్నాయి. ఈ గుర్తింపు పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామంచ పాఠశాల ఉపాధ్యాయుడు వైవి సురేశ్‌కుమార్ స్పందిస్తూ ఉపాధ్యాయుల సమిష్టి కృషే ఈ గుర్తింపునకు కారణమని పేర్కొన్నారు. ప్రైవేటుకు దీటుగా పాఠశాలను తీర్చిదిద్దడానికి దాతలు, గ్రామస్థులు అందించిన సహకారాన్ని ఆయన స్మరించుకున్నారు.

అలాగే, సింగన్నగూడ ఉపాధ్యాయురాలు క్రాంతికుమారి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే సమాజం తప్పకుండా గుర్తిస్తుందని ఈ అవకాశం నిరూపించిందని తెలిపారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి ముంద్రాతి రమేశ్ స్పందిస్తూ ఉపాధ్యాయుల కృషి, వినూత్న బోధన ఫలితంగానే ఈ సక్సెస్ స్టోరీలు మ్యాగజైన్‌లో చోటు దక్కించుకున్నాయని, ఇది జిల్లాకు గర్వకారణమని అభినందించారు.

రాహుల్.. క్షమాపణ చెప్పాల్సిందే

సిద్దిపేట క్రైం ఆగస్ట 30(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో చేపట్టిన ఓటర్ యాత్రలో ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం సిద్దిపేట బస్టాండ్ వద్ద బీజేపీ శ్రేణులతో కలిసి రాహుల్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా బైరి శంకర్ మాట్లాడుతూ ప్రధాని తల్లి పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.మోడీ తల్లి నిరుపేద కుటుంబంలో జీవితం గడిపినప్పటికీ తన పిల్లలను మాత్రం విలువలతో పెంచారని కొనియాడారు.

ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

రాయపోల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ పదవీకాలంలో చేసిన సేవలే చిరస్మరణీయంగా నిలుస్తాయని సిద్దిపేట జిల్లా పరిషత్ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి పేర్కొన్నారు. శనివారం రాయపోల్‌లో జరిగిన ఎంపీడీవో బాలయ్య పదవీ విరమణ సమావేశానికి అధికారులు హాజరయ్యారు. బాలయ్యను అధికారులతో పాటు మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పెద్ద చెరువును పరిశీలించిన బక్కి



భూంపల్లి పెద్దచెరువును సందర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): నిండుకుండలా మారిన మండల కేంద్రంలోని భూంపల్లి పెద్దచెరువును శనివారం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గ్రామస్థులతో కలిసి సందర్శించారు. చెరువు అలుగుపారుతుండడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. చెరువు ఆయా కట్ట ద్వారా సుమారు 300ఎకరాల వరకు సాగుచేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ముదిరాజ్‌లు చేపలు పట్టుకోవడానికి ఉపాధిదొరుకుతుందని తెలిపారు. చెరువులు కుంటలు, వాగులు పొంగిపొర్లుతుండడంతో అటువైపు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఆయన వెంట గ్రామస్థులు యాదయ్య, జగన్, బాలాగౌడ్, నరేష్, సత్తయ్య, నర్సయ్య, నర్సింలు తదితరులున్నారు.

కథల పోటీకి జాతీయ స్థాయి గుర్తింపు

నంగునూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):నంగునూరు మండలం రాజగోపాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కథలు జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీలో బహుమతులకు ఎంపికయ్యాయి. ఖమ్మం పట్టణానికి చెందిన పురిమళ్ల ఫౌండేషన్ సప్తమ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు జాతీయ స్థాయిలో పురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీలు నిర్వహించింది. ఈ పోటీలకు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి, వివిధ రాష్ట్రాల పాఠశాల విద్యార్థులు తాము రాసిన తెలుగు కథలను పంపించారు.

దివ్యాంగులకు ఉచిత నిర్ధారణ శిబిరం

● జిల్లాలో మూడు రోజులపాటు కొనసాగనున్న క్యాంప్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబర్ 1 నుంచి మూడు రోజులపాటు భారత కృతిమ అవయవాల నిర్మాణ సంస్థ, సమగ్రశిక్ష జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రిటైర్మెంట్ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదు

సిద్దిపేట క్రైం ఆగస్ట 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ రిటైర్మెంట్ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అన్నారు. గజ్వేల్ ఎస్సై మాస్కుల యాదగిరి రెడ్డి, సీఎస్సీ ఏఎస్సై హనుమంత రెడ్డి, గజ్వేల్ హెడ్ కానిస్టేబుల్ శేరి కార్ వెంకటేశ్వరరావుల పదవి విరమణ సందర్భంగా వారిని కమిషనర్ కార్యాలయంలో అభినందించి సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

సెర్ప్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెర్ప్ సిబ్బంది జిల్లాలో విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేశారు. జిల్లాలోని సెర్ప్ సిబ్బందిలో ఎల్ 2, ఎల్ 1, ఎంఎస్ సీసీఎస్ 115 మంది ఉద్యోగులకు శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ కౌన్సిలింగ్ నిర్వహించి, బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మహిళా సంఘాలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు అన్ని మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ ఇవ్వడం జరిగిందన్నారు.

పంచాయతీ కార్యదర్శి పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

జగదేవ్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి శైలేష్‌పై సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు గౌతమ్, మురళి, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతికి తిమ్మాపూర్ కార్యదర్శి శైలేష్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 18 నెలలుగా గ్రామపంచాయతీలకు తమ సొంత డబ్బులు పారిశుద్యం, వీది దీపాలకు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.